ఆక్రమణల చెరలో..

- సింగ్‌నగర్ 'ఆర్‌యూబీ'
- కుచించుకుపోతున్న రోడ్డు
- చిరువ్యాపారుల హడావుడి
- రోడ్డు మధ్యలో వాహనాలు నిలిపివేత
- తీవ్ర ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని అధికారులు


పార్కింగ్ జోన్‌కాదు.. సింగ్‌నగర్ ఆర్‌యూబీ రోడ్డు


ఈ రోడ్డులో నిత్యం ఇలా ట్రాఫిక్ ఇబ్బందులే..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆక్రమణ చెరలో సింగ్‌నగర్ ఆర్‌యూబీ రోడ్డు చిక్కుకుంది. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదగా నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన లక్ష్యంతో దాని వెంట ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి) ఏర్పాటుచేశారు. అయితే ఈ రోడ్డుకు రెండువైపులా చిరువ్యాపారుల బళ్లు రావడంతో రహదారి కుచించుకుపోతోంది.

'మామూళ్ల' మత్తులో!

సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా మొత్తం దాదాపు 100 అడుగుల మేర ఉండాల్సి ఉంది. ఆర్‌యూబీ మార్గంలో 50 నుంచి 60 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉంది. అయితే ఈ రోడ్డులో పలు చోట్ల దుకాణాలు వెలవడం, మరికొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా హాకర్లు ఆక్రమించుకోవడంతో ఇది 30 అడుగులు కూడా లేకుండా కుచించుకుపోయింది. ఈ దుకాణాలకు వస్తున్న వినియోగదారులు తమ వాహనాలను ఇష్టం వచ్చినట్లుగా రోడ్డుపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. దీనిపై పోలీసు అధికారులు, కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ప్రజలు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. బీటు కానిస్టేబుళ్లు, హోంగార్డులు ప్రతి రోజూ ఈ దుకాణాల వద్దకు వచ్చి డబ్బులు తీసుకొని వెళ్తూ.. ట్రాఫిక్ సమస్యల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి 'ఆర్‌యూబీ' దారిలో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించి, ఆక్రమణల చెర నుంచి ఈ రోడ్డును కాపాడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆనందం.. కొంతకాలమేనా..?

సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీద నుంచి ఇటు పాయకాపురం, కండ్రిక, నున్న, నూజివీడు ప్రాంతాలతో పాటు అటు వైఎస్సార్ కాలనీ, జక్కంపూడి, అంబాపురం, నైనవరం, కొత్తూరు తాడేపల్లి ప్రాంతాల్లోని ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఫ్లై ఓవర్‌పై రద్దీ పెరిగిపోయింది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత అధికంగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పదేళ్ల క్రితం రామకృష్ణాపురం, ఇందిరానాయక్‌నగర్ మధ్యలో ఆర్‌యూబీ మార్గాన్ని ఏర్పాటుచేశారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ సమస్య ఏర్పడినప్పుడు పోలీసులు ఇటువైపు ట్రాఫిక్‌ను మళ్లిస్తుంటారు. ఆర్‌యూబీ రాకతో కాస్త ఊరట లభించిందని అందరూ ఆనందపడేవారు. ఇటీవల కాలంలో ఈ మార్గం ఆక్రమణలకు గురికావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో 'ఆర్‌యూబీ' ఆనందం కొంతకాలమే అన్నట్లుగా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.


పలు టిఫిన్ హోటళ్లు, కూరగాయల దుకాణాల వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

రోడ్డు మధ్యలో వాహనాలు



ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ఆర్‌యూబీ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాం. ఈ రోడ్డు మొత్తం ఆక్రమణలకు గురవుతోంది. రోడ్డు మధ్యలో బైకులు, ఆటోలు, కార్లు నిలిపివేస్తున్నారు. ఈ రోడ్డుపైకి రావాలంటేనే ట్రాఫిక్ భయం కలుగుతోంది. ఆక్రమణలను తొలగించి.. ప్రయాణికులకు అనుకూలంగా మారిస్తే వేలమందికి ఇది అందుబాటులోకి వస్తుంది.

–చుండూరు శ్రీనివాసరావు, సింగ్‌నగర్

పార్కింగ్ ప్రాంతంగా రోడ్డు



ఫ్లై ఓవర్ మీద ప్రమాదాలు, ట్రాఫిక్‌కు భయపడి ఆర్‌యూబీ మీదనే ప్రతి రోజూ పిల్లలను కాలేజీకి తీసుకొని వెళ్లివస్తుంటాం. కొంతమంది దుకాణదారులు, హాకర్లు రోడ్డును ఆక్రమించేశారు. అదేమని అడిగితే గొడవలకు వస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దృష్టిపెట్టి.. ఈ రోడ్డును అందరికి అందుబాటులో ఉంచాలని కోరుతున్నాను.

–నెల్లి గోవింద్‌నాయుడు, న్యూఆర్ఆర్‌పేట

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం

ఎంపీ కేశినేని శివనాథ్


సమావేశంలో పాల్గొన్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే సుజనా, కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం ఆయన పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, వివిధ శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర అభివృద్ధితోపాటు ప్రజ లు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమ కూర్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ము ఖ్యంగా రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి, బీఆర్‌టీఎస్ రోడ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు వెళ్లేందుకు అవసరమైన ప్లాన్, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట నుంచి ఎర్రకట్ట వెళ్లేందుకు బ్రిడ్జిలు నిర్మించే అంశంపై చర్చించారు.

మౌలిక వసతుల కల్పన..

ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు, శివారు, కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. నగరపాలక సంస్థకు ఆదాయాన్ని తెచ్చే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. రాబడి పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విజయవాడ నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపొందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించేందుకు విజయవాడలోని స్టేడియంలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

శాఖల మధ్య సమన్వయం అవసరం..

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా) చౌదరి మాట్లాడుతూ నగర అభివృద్ధిపై పూర్తి దృష్టి సారించామన్నారు. అందులో భాగంగా రోడ్లు, రైల్వే బ్రిడ్జిలు, శానిటేషన్, స్మార్ట్ టాయిలెట్స్, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల ఏర్పాటుతో పాటు ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ వంటి అనేక సుందరీకరణ కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు.

సమష్టి కృషి..

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర అభివృద్ధికి వివిధ శాఖల అధికారులందరూ సమష్టి కృషితో పని చేస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా ఖాళీ స్థలాలు, ఆస్తి వంటి పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ శ్రీనగర్‌కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేపల్లి వారి వీధి, అడవి శేషగిరిరావు వీధి, జాగర్లమూడి వారి వీధి, దండమూడి రామ్మోహన్ రావు వీధి, భగత్ సింగ్ రోడ్డు, బ్రహ్మయ్య పంతులు వీధి నర్రవారి వీధి, కొమ్ము వారి వీధి పాపరాజు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అవధాన సరస్వతికి సాహితీ సమార్చన

విజయవాడ కల్చరల్: దక్షిణామ్నాయ శృంగేరీ శారదాపీఠాధిపతి విధుశేఖర స్వామి విజయయాత్ర సందర్భంగా మంగళవారం శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో నిర్వహించిన యువ అవధాని గన్నవరం లలితాదిత్య నిర్వహించిన అష్టావధాన కార్యక్రమం అలనాటి శ్రీ కృష్ణదేవరాయల భువన విజయాన్ని గుర్తు చేసింది. అవధాని లలితాదిత్య 24 ఏళ్ల యువకుడు. పృచ్ఛకుల ప్రశ్నల పరంపరను తేలికగా ఎదుర్కొన్నాడు. సభాధ్యక్షుడు ఆచార్య శలాక రఘునాథ శర్మ అవధాని జీవిత విశేషాలను వివరించారు. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్(నిషిద్ధాక్షరి), డాక్టర్ రాంభట్ల పార్వతీశ్వర శర్మ(దత్తపది), దండిభట్ల దత్తాత్రేయ శర్మ(వర్ణన), డాక్టర్ కప్పగంతు రామకృష్ణ (న్యస్తాక్షరి,) డాక్టర్ పోపూరి గౌరీనాథ్,(కావ్యగానం), డాక్టర్ తాతా సందీప్ శర్మ (అప్రస్తుత ప్రసంగం) అంశాలను నిర్వహించారు.

కృష్ణా యోగా జట్టులో కేబీఎన్ విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం పక్షాన అంతర్ విశ్వవిద్యాలయ యోగా పోటీలకు కేబీఎన్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఇటీవల పీబీ సిద్ధార్థ కళాశాలలో విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల యోగా పోటీలు జరిగినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైన వారిలో పురుషుల జట్టులో వైకేఎస్‌డీ గౌరీనాథ్, ఎం. రాకేష్, బాలికల జట్టులో ఎండీ తెహరాన్, ఎస్‌కే సమీర్ ఉన్నట్లు తెలిపారు.

చదువే ఆయుధం

సమగ్ర శిక్ష ఏపీసీ ఉమామహేశ్వరరావు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అతిథులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజంలోని అసమానతలు రూపుమాపడానికి చదువే ఆయుధమని సమగ్ర శిక్ష, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ) ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్, పోలీసు శాఖ-ఏహెచ్‌టీయూ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పలు సంస్థల నిర్వహణలో సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ హైస్కూల్ ప్రాంగణంలో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు, బాలలపై జరుగుతున్న హింస వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటివి సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. బాలబాలికలు కనీసం డిగ్రీ వరకు చదువుకొని స్వయం శక్తితో ఉండాలని, జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని సూచించారు. గౌరవ అతిథి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పరసా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్సై కేబీ సుబ్బారావు మాట్లాడుతూ బాలలకు ఏదైనా ఇబ్బందులు కలిగితే వెంటనే పెద్దలకు, తల్లిదండ్రులకుగానీ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100/112 లేదా ఉమన్ హెల్ప్ లైన్ 181 నంబర్లకు ఫోను చేయాలని తెలిపారు. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తెలిపారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ చైతన్యం నింపడానికి బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి.. విద్యార్థులతో బాలల హక్కులకు ప్రతిజ్ఞ చేయించారు. బర్డ్స్ సంస్థ సెక్రటరీ కోటే ప్రకాష్ కుమార్, కృప ఫౌండేషన్ చైర్మన్ రవీంద్ర, బాలల హక్కుల కార్యకర్తలు పెండెం విజయ్ కుమార్, సందీప్ కుమార్, పిడుగు భాస్కర ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతి సంక్షేమానికి కృషి చేయాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు జాతి సంక్షేమానికి కృషి చేయాలి సామాజిక ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. అయోధ్యనగర్ నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల వాయిద్య శిక్షణ కేంద్రంలో మంగళవారం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేషన్ డైరెక్టర్లకు వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యాన అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. కార్పొరేషన్ డైరెక్టర్‌లు ఎస్.నాగరాజు, ఎం.గంగాధర్, శివశేషగిరిరావు, విజయకుమార్‌లను సత్కరించి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు కార్యక్రమంలో వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు యలమందరావు, మురళీకృష్ణ, నిడమానూరి యలమందరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బుడమేరులో దోమల నివారణ చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల దోమల ఉధృతి పెరగడంతో ప్రజల విజ్ఞప్తిపై వీఎంసీ అధికారులు బుడమేరులో మంగళవారం దోమల నివారణ చర్యలు ప్రారంభించారు. బుడమేరులో పేరుకు పోయిన చెత్తచెదారాన్ని తొలగించారు. బోట్‌లు, డ్రోన్‌ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. మలేరియా నివారణ చర్యలను బయాలజిస్టు నాయక్ పర్యవేక్షించారు.

స్పందించారు.. తొలగించారు..



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న మట్టి దిబ్బలను ఎట్టకేలకు సోమవారం రాత్రి తొలగించారు. మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో మురుగు కాలువ పనులు నిర్వహించారు. దానిలో భాగంగా తవ్విన మట్టి దిబ్బలను రోడ్డుపైనే వదలివేశారు. వాహనచోదకులు, పాదచారులు అవస్థ పడుతున్నారు. వీరి ఇబ్బందులు వివరిస్తూ ' రోడ్డు ఇలా.... రాకపోకలు ఎలా..?' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు మట్టి దిబ్బలు తొలగించారు. అయితే ఇక్కడ ఉన్న మట్టి దిబ్బలు పూర్తిస్థాయిలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

24, 25 తేదీల్లో కార్తిక ఉత్సవాలు



విజయవాడ కల్చరల్: శత సహస్ర దీపార్చనా సేవామండలి ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడురోజులు కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సేవా మండలి వ్యవస్థాపకుడు నాగలింగం శివాజీ తెలిపారు. మంగళవారం బందరురోడ్డులోని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సత్యనారాయణపురంలోని విజ్ఞాన విహార్ పాఠశాల (పాత శిశువిద్యామందిర్) ప్రాంగణంలో 24, 25 తేదీల్లో రాత్రి 7గంటలకు కార్తిక దీపోత్సవం , 26 వ తేదీ సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకుడు అవ్వారు బుచ్చబ్బాయి మాట్లాడుతూ భక్తులు ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహకుడు ఎ.శేషుబాబు పాల్గొన్నారు.

కనులపండువగా దీపోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివ కామేశ్వరీ పీఠంలో మంగళవారం సాయంత్రం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా దీపోత్సవం కనులపండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శేఖర్ శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసంలో దీపారాధన చేయడంతో కలిగే ప్రయోజనాలు, దీపారాధన విశిష్టతను వివరించారు. శివలింగాకారం, ఓం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. తొలుత నీలకంఠేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

సంకట హర చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో మంగళవారం సంకట హర చతుర్థి పూజలు ఆలయకమిటీ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. ఆలయంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు జరిగాయి.

పారదర్శకంగా బాండ్ల పరిశీలన

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల పనులను పారదర్శకంగా పరిశీలించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో టీడీఆర్ బాండ్ల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గుణదల, ఏలూరు రోడ్, బందరు రోడ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, అక్కడి నుంచి ఆటోనగర్ వరకు ఉన్న ప్రాంతాలలో టీడీఆర్ బాండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను కమిటీ ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ రోడ్లను అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం స్థలం లేదా నిర్మాణం కోల్పోయిన ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు కమిటీ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిమిత్తం రూపొందించిన మాస్టర్ ప్లాన్ ద్వారా ప్రజలు ఎంత ప్రదేశాన్ని కోల్పోయారు.. దాని మార్కెట్ విలువ ఆధారంగా కమిటీ సభ్యుల అంగీకారంతో టీడీఆర్ బాండ్లను విడుదల చేస్తామని పేర్కొన్నారు. కాగా ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల వివరాల మేరకు 31 టీడీఆర్ బాండ్లను కమిటీ సభ్యులు పరిశీలించారు. వాటిల్లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని కమిషనర్ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఆర్‌డీడీటీసీపీ రాజమహేంద్రవరం శ్రీనివాసమూర్తి, డీటీసీపీ (ఏపీ సీఆర్‌డీఏ) వి. సునీత, సెంట్రల్, నార్త్ తహసీల్దార్లు వెంకటరామయ్య, సూర్యారావు, గాంధీనగర్, పటమట, గుణదల జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ఆరిఫ్, రేవంత్, నందీశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

స్కాన్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అతిక్రమించకుండా స్కానింగ్ సెంటర్‌లు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. విజయవాడలో మంగళవారం జరిగిన గైనకాలజిస్ట్స్ అసోసియేషన్ సమావేశంలో ఆమె అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ సరోగసీ యాక్ట్ ఆవశ్యకత, ప్రైవేటు ఆస్పత్రులు పాటించాల్సిన నియమ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గణాంక అధికారి లక్ష్మోజీ మాట్లాడుతూ ప్రతి మాతాశిశు సేవలు అందించే ప్రైవేటు ఆస్పత్రులు విధిగా హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ద్వారా సమాచారం అప్లోడ్ చేయాలన్నారు. జననాలు విధిగా నమోదు చేయాలని సూచించారు. ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వేలెన్స్‌లో భాగంగా జ్వరం కేసులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్స్ అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ పద్మజ, డాక్టర్ కోడే ప్రభాదేవి పాల్గొన్నారు.

మహిళా విజయాన్ని స్వాగతించాలి


మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి రమాదేవి

విజయవాడ కల్చరల్: మహిళా విజయాన్ని స్వాగతించాలని ఠాగూర్ గ్రంథాలయ అధికారి రమాదేవి అన్నారు. పోలుకొండ మంగతాయారు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవం స్వీయ కవితా గానం కార్యక్రమం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ దేశ సాంస్కృతిక, రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వారి కృషి వెలకట్టలేనిదన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ మగవారి విజయానికి మహిళలే కారణమన్నారు. నిర్వాహకులు అతిథులను ఆత్మీయంగా సత్కరించారు.


గుర్తు తెలియని ఆటో ఢీ.. బాలుడికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టడంతో బాలుడు గాయపడిన ఘటన గుణదల పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానుకు చెందిన సారేపల్లి లోవలక్ష్మికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం ఉదయం లోవలక్ష్మి కుమార్తెను బీఆఎస్ రోడ్డులో స్కూలు బస్సు ఎక్కించి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో బీఆర్టీఎస్ రోడ్డులో ప్రజలు గుమిగూడి ఉన్నారు. ఏమిటని చూడగా ఆమె మూడేళ్ల కుమారుడు సాత్విక్ దర్శన్ (గాయపడి ఉన్నాడు. దీంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వేగంగా వచ్చిన గుర్తుతెలియని ఆటో ఢీ కొట్టడంతో సాత్విక్ దర్శన్ గాయపడ్డాడని లోవలక్ష్మి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సేవా నంది, సేవా భూషణ్' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి' (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ) హైదరాబాద్ 19వ వార్షికోత్సవం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి సేవా నంది, సేవా భూషణ్ పురస్కారాలతో సత్కరించనున్నట్లు సంస్థ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని మేధావులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, వైద్యులు, కళాకారులు వారు అందిస్తున్న సేవలను వివరిస్తూ ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తి సమాచారానికి 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


మధురానగర్‌లో రోడ్డు కంటే ఎత్తుగా మ్యాన్‌హోల్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డులో మ్యాన్‌హోల్ రోడ్డు కంటే ఎత్తులో ఉండటంతో ప్రమాదకరంగా మారింది. వేగంగా వచ్చిన వాహన చోదకులు ఎత్తులో ఉన్న మ్యాన్‌హోల్‌ను ఢీకొని గాయాలబారిన పడుతున్నారు. పసుపుతోట వైపు నంచి వచ్చే వాహనచోదకులు ఈ మ్యాన్‌హోల్ కారణంగా అవస్థ పడుతున్నారు. అధికారులు స్పందించి సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.